సాక్షి నల్లగొండ

సోమవారం। 19। మే। 2025



ఎస్టీ జాబితాలో చేర్చాలి

వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర మేలుకొలుపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ అన్నారు. - 8లో



పీహెచ్‌సీలో అగ్నిప్రమాదం

నిడమనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో శనివారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. - 8లో

గరిష్టం/కనిష్టం
38°/26°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

21న ముస్లిం పర్సనల్ లా బోర్డు సభ

నల్లగొండ : వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకం గా, భారత రాజ్యాంగ పరిరక్షణకు ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో నల్లగొండలో ఈ నెల 21న బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సభ కన్వీనర్ మౌలానా బసీర్ ఖాస్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ బోర్డు అధ్యక్షుడు ఖలీద్ సైఫుల్లా రహమాని అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. ఈ సభకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సభకు ముస్లిం మైనార్టీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మంత్రి తుమ్మలను కలిసిన డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



మంత్రి తుమ్మలతో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆదివారం హైదరాబాద్‌లో నల్లగొండ డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలోని సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వ పరంగా తగిన సహాయ సహకారాలు అందించాలని కోరారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు 50 శాతం సబ్సిడీతో రుణాలు అందేలా ప్రణాళిక సిద్ధం చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని విన్నవించారు. వీటికి సానుకూలంగా స్పందించిన మంత్రి తుమ్మల సహకార సంఘాల బలోపేతానికి తనవంతు సహకారం అందిస్తాని హామీ ఇచ్చారని తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ప్రశాంతం

నల్లగొండ : జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఆదివానం నల్లగొండలోని ఎస్‌పీఆర్ పాఠశాల కేంద్రంలో ప్రశాంతంగా జరిగింది. ఈ కేంద్రానికి మొత్తం 185 మంది విద్యార్థులను కేటాయించగా.. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన మొదటి పేపర్ పరీక్షకు 181 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు జరిగిన రెండో పేపర్‌కు 180 మంది విద్యార్థులు హాజరయ్యారు.

నేత్రపర్వంగా తిరువీధి సేవ



స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు

భువనగిరి : పట్టణ పరిధిలోని స్వర్ణగిరి క్షేత్రంలో గల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి స్వామివారికి తిరువీధి సేవ నేత్రపర్వంగా నిర్వహించారు. అంతకుముందు వేకువజామున సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన, నిత్యకల్యాణ వేడుక తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామివారికి కర్పూర మంగళహారతులు సమర్పించారు.

ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వొద్దు

సూర్యాపేట : ఉద్యోగ నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్లు ఇవ్వొద్దని మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు, న్యాయవాది తల్లమల్ల హస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఎస్సీ వర్గీకరణ తీర్పు, గైడ్‌లైన్సను సరిగ్గా పరిశీలించకుండా ఎస్సీ వర్గీకరణ చేయడం తగదని పేర్కొన్నారు. ఈ విషయంపై మాల మహానాడు, షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరం తరఫున హైకోర్టులో పిటిషన్ వేశామని తెలిపారు. రెండు వాయిదాల తర్వాత కూడా రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయలేదని ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వొద్దని పేర్కొన్నారు.

మండువేసవిలో నిండుగా జలం



తిప్పర్తి : వేసవి వచ్చిందంటే చెరువులు, కుంటలు ఎండిపోయి కనిపిస్తాయి. కానీ తిప్పర్తి మండలంలోని గంగన్నపాలెం గ్రామంలో ఉన్న చెరువు మాత్రం మండుటెండలో నిండుకుండలా జలకళ సంతరించుకుంది. పానగల్ చెరువు నుంచి వచ్చే జాలు, చందనపల్లి వద్ద ఉన్న వాటర్‌ప్లాంట్‌నుంచి వేస్ట్ వాటర్ ఈ చెరువులోకి చేరుతుంది. ఈ చెరువులో నిత్యం నీరు ఉండడంతో గంగన్నపాలెం, కాశివారిగూడెం, నానాపురం, రాజుపేట గ్రామాల్లో భూగర్భ జలాలు పుష్కలంగా ఉంటాయి. ఈ వేసవిలో చెరువు నిండు కుండలా ఉండడంతో ముందస్తుగా పంటల సాగుకు అవకాశం ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్యాన్ని మించి.. రుణం

పొదుపు సంఘాలకు 105 శాతం బ్యాంకు లింకేజీ రుణాలు

- రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లాకు మొదటిస్థానం
- మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డు అందుకున్న డీఆర్‌డీఓ
- మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్న రుణం



నల్లగొండ : మహిళల ఆర్థికాబివృద్ధికి ప్రభుత్వం బ్యాంకు లింకేజీ ద్వారా అందించే రుణాలు ఈ ఏడాది లక్ష్యాన్ని దాటాయి. ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఏటా రుణాలు ఇవ్వడంలో లక్ష్యాన్ని నిర్ణయిస్తుంది. 2024–25 సంవత్సరంలో రుణాల మంజూరులో నల్లగొండ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. దీంతో ఇటీవల జరిగిన కార్యక్రమంలో మంత్రి సీతక్క చేతుల మీదుగా డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, ఇతర అధికారులు అవార్డు అందుకున్నారు.

రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు..

స్వయం సహాయక మహిళా సంఘాలకు సెర్ప్ అధికారులు, సిబ్బంది ఆయా సంఘాల అర్హతను బట్టి రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు మంజూరు చేశారు. సభ్యులకు సంఘాల తీర్మాణంతో రూ.లక్ష నుంచి 5 లక్షల వరకు వ్యక్తిగత రుణాలు సైతం ఇచ్చారు. ఈ రుణంతో మహిళలు కిరాణా, వస్త్ర, స్టేషనరీ, పిండి గిర్నిలు, ఎంబ్రాయిడరీ, స్వీట్ల తయారీ తదితర దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇలా మహిళలంతా వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఈ రుణాలు దోహదపడుతున్నాయి.

జిల్లాలో 22,937 మహిళా సంఘాలు

జిల్లాలోని 32 మండలాల పరిధిలో మొత్తం 22,937 సంఘాలు ఉండగా 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.1094 కోట్ల రుణాలు అందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. సగానికి పైగా సంఘాలకు ఇచ్చిన టార్గెట్ కంటే ఎక్కువ రుణాలు పొందాయి. అన్ని సంఘాలకు కలిపి రూ.1150 కోట్లు రుణాలు అందించారు. దీంతో 105.23 శాతం రుణాలను మహిళా సంఘాలకు అందించగలిగారు.

సిబ్బంది సమష్టి కృషి

నల్లగొండ జిల్లా డీఆర్‌డీఏ అధికారులు బ్యాంకు లింకేజీలో లక్ష్యానికి మించి రుణాలు అందించినందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అభినందించింది. ఇటీవల జరిగిన కార్యక్రమంలో బ్యాంకు లింకేజీ కింద రుణాలు అధికంగా ఇచ్చి మహిళా సంఘాలను ప్రోత్సహించినందుకు ప్రభుత్వం నుంచి అవార్డు వచ్చింది. డీఆర్‌డీఏ సిబ్బంది అంతా కలిసి కట్టుగా పని చేయడం వల్లే అవార్డును సాధించగలిగామని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి పేర్కొంటున్నారు.



మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డు అందుకున్న డీఆర్‌డీఓ (ఫైల్)

యాంత్రీకరణకు నిధులేవీ!

- రూ.1.81 కోట్లు కేటాయించిన ప్రభుత్వం
- మార్చి నెలాఖరుకు గ్రౌండింగ్ చేయాలని ఉత్తర్వులు
- నిధులు రాకపోవడంతో గ్రౌండింగ్ చేయని వ్యవసాయ శాఖ
- రైతుల ఆశలపై నీళ్లు చల్లిన ప్రభుత్వం



నల్లగొండ అగ్రికల్చర్ : గత ప్రభుత్వ హయాంలో (2018లో) నిలిచిపోయిన వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పునరుద్ధరిస్తామని అట్టహాసంగా ప్రకటించింది. రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను అందిస్తామని చెప్పి 2024 సంవత్సరానికి గాను జిల్లాకు రూ.1.81 కోట్ల నిధులను కేటాయించింది. మార్చి 31వ తేదీలోగా రైతులకు యాంత్రీకరణ పరికరాలను గ్రౌండింగ్ చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా విడుదలు చేయకపోవడంతో ఈ పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ పథకాన్ని గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా మూలన పెడుతుందా లేదా నిధులను విడుదల చేసి పునరుద్ధరిస్తుందా అనే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి.

820 యూనిట్లు మంజూరు

రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని తిరిగి ప్రారంభిస్తామని చెబుతూ జిల్లా వ్యాప్తంగా మొత్తం 820 యూనిట్లు మంజూరు చేసింది. కలెక్టర్ అనుమతిలో జిల్లా వ్యవసాయ శాఖ మండలాల వారీగా వ్యవసాయ పరికరాలను అలాట్ చేసింది. వాటిని కేటాయించేందుకు రైతుల నుంచి వ్యవసాయ శాఖ దరఖాస్తులు ఆహ్వానించింది. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. కానీ మార్చి దాటి మే నెల వస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకానికి ఒక్కపైసా కూడా విడుదల చేయలేదు. సబ్సిడీ పరికరాల కోసం జిల్లా వ్యాప్తంగా రైతులు వ్యవసాయ శాఖ అధికారులను ఆరా తీసినా.. వారి దగ్గర ఎలాంటి సమాచారం లేదు. ఆరేడు సంవత్సరాలుగా యాంత్రీకరణ పథకం లేకపోవడం వల్ల రైతులే పూర్తిగా డబ్బులు వెచ్చింది ట్రాక్టర్లు, రోటవేటర్లు, కల్టివేటర్లు, స్ప్రేయర్లు, ఇతర యాంత్రీకరణ పరికరాలను కొనుగోలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం యాంత్రీకరణను పునరుద్ధరిస్తామని ప్రకటించడంతో రైతులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లు అయ్యింది.

నిధులు విడుదల కాలేదు

వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి సంబంధించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదు. పరికరాలు, నిధుల కేటాయింపు మాత్రమే చేసింది. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే పరికరాలను గ్రౌండింగ్ చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ

మొలకెత్తని మొక్కలు

అడవిదేవులపల్లి : మండలంలోని ఉల్సాయిపాలెంలో ఏర్పాటు చేసిన నర్సరీలో అధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో నర్సరీలోని మొక్కలను పట్టించుకోలేదు. జూన్‌లో మొక్కలను పంపిణీ చేయాల్సి ఉండగా ఈ నర్సరీలో మొక్కలు మొలకెత్తలేదు. కేవలం ప్లాస్టిక్ కవర్లలో మట్టిమాత్రమే ఉంది.



నీరు వృథా.. రైతు వ్యథ



తూము నుంచి వస్తున్న నీరు



పొలాల్లో పెరిగిన జమ్ము

- ఉదయ సముద్రం గేట్ల నుంచి లీకవుతున్న నీరు
- జాలు పడుతున్న పొలాలు
- పంటల సాగుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతుల ఆవేదన
- ఏడాది కాలంగా పట్టించుకోని అధికారులు

నల్లగొండ : వర్షాలు సరిగ్గా కురవక ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి నిల్వలు తగ్గుతుంటే.. ఉన్న నీటిని ఒడిసిపట్టడంలో పానగల్ ఉదయ సముద్రం రిజర్వాయర్ అధికారులు విఫలమవుతున్నారు. నల్లగొండ పట్టణ సమీపంలోని పానగల్ ఉదయ సముద్రం నుంచి గేట్ల వద్ద వాల్వ్ సక్రమంగా లేక నీరు లీకై వృథాగా పోతోంది. దాంతో ఆ ప్రాంతంలో భారీగా జమ్ము మొలవడమే గాక ఆ నీరు రైతుల పొలాల్లో పారుతోంది. దీంతో పొలాలు జాలుపట్టి పంటలు సరిగా పండడం లేదు. ఎప్పుడూ నీరు ఉండడం వల్ల పొలాలు ఆరడం లేదు. పంట కోతకు వచ్చిన సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వాల్వ్ సక్రమంగా లేక..

వాల్వ్ సక్రమంగా లేక సంవత్సరం నుంచి నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు అంటున్నారు. పంటలు కోత కొచ్చిన సమయంలో వరి కోత మిషన్ దిగబడుతుండడంతో మిషన్ యజమానులు ముందుకు రావడం లేదని అంటున్నారు. వ్యవసాయ సీజన్ సమీపిస్తోంది. పొలాలు దున్నాలన్నా.. ఆరడం లేదని రైతులు వాపోతున్నారు. వృథాగా పోతున్నా నీటిని అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని.. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి లీకేజీని అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

వృథా నీటితో ఇబ్బంది పడుతున్నాం



వాల్వ్ సక్రమంగా బిగించకపోవడం వల్ల ఉదయ సముద్రం నుంచి పెద్ద ఎత్తున నీరు లీకై వృథాగా పోతోంది. వరద ఎక్కువై పొలాల మీదుగా పారుతుండడంతో పంట పెద్దగా రాకపోగా పండిన కొద్ది పంటను కూడా కోసుకోలేకపోతున్నాం. మళ్లీ వ్యవసాయ సీజన్ వస్తోంది. భూమి దున్నాలన్నా నీరు పోయే పరిస్థితి లేదు. ఇరిగేషన్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. వృథా నీటితో ఇబ్బంది పడుతున్నాం.

– సముద్రాల అంజయ్య, రైతు

సమస్యను పరిష్కరిస్తాం

ప్రస్తుతం తాగునీటి కోసం ఉదయసముద్రంలో నీటిని నింపాం. నీరు అధికంగా ఉన్నప్పుడు కట్ట నుంచి కూడా సీపేజి వాటర్ వస్తుంది. ఇక్కడ తూము ఉండడం వల్ల మరింత పెరిగింది. రోజు మార్చి రోజు మరమ్మతులు చేస్తున్నాం. కానీ తగ్గడం లేదు. ఉదయ సముద్రంలో నీరు తగ్గుతుంటే సీపేజి వాటర్ తగ్గుతుంది. అప్పుడు పూర్తిగా నీరు లీక్ కాకుండా చేస్తాం. 15 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం.

– శ్రీనివాస్, ఇరిగేషన్ శాఖ డీఈ

రోడ్డు దాటాలంటే భయం.. భయం

ప్రమాదాలకు నిలయంగా నకిరేకల్ పద్మానగర్ జంక్షన్

- బ్లాక్ స్పాట్‌గా గుర్తించినా.. నామమాత్రంగా భద్రతా చర్యలు
- అండర్ పాస్ నిర్మించాలని కోరుతున్న ప్రజలు
- ఇనుపాముల వద్ద పూర్తి కాని సర్వీస్ రోడ్లు



నకిరేకల్‌లోని పద్మానగర్ జంక్షన్ వద్ద రాత్రివేళ రోడ్డు దాటుతున్న వాహనాలు

నకిరేకల్ : నిత్యం వాహనాల రద్దీ ఉండే హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై నకిరేకల్ పట్టణం శివారులోని పద్మానగర్ జంక్షన్ ప్రమాదాలకు అడ్డాగా మారింది. ఈ జంక్షన్ వద్ద గత ఆరు నెలల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. 10 మందికి పైగా గాయాలపాలయ్యారు. ఈ ప్రాంతాన్ని గతంలోనే బ్లాక్ స్పాట్‌గా గుర్తించిన అధికారులు.. నామమాత్రపు భద్రతా చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. ఈ ప్రాంతంలో అండర్ పాస్ నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదు. మరోవైపు పట్టణ సమీపంలో సర్వీస్ రోడ్డు పనులు కూడా పూర్తికాలేదు. దీంతో ప్రాంతంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.

కొన్నాళ్లకే స్టాపర్ల తొలగింపు

పద్మానగర్ జంక్షన్ వద్ద ప్రమాదాల నివారణకు ఏప్రిల్ నెలలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారికి ఇరువైపులా స్టాపర్లు ఏర్పాటు చేశారు. సగం ఇసుక, సగం నీరు నింపి రోడ్డుకు అడ్డంగా రంబుల్స్ పెట్టారు. అవి కేవలం ఇక వారం రోజుల పాటు ఉంచి ఆ తర్వాత అక్కడి నుంచి తీసేవేశారు. దీంతో మళ్లీ సమస్య మొదటికే వచ్చింది. ఈ జంక్షన్ పక్కనే పద్మానగర్ కాలనీ ఉంది. ఈ కాలనీవాసులు రాత్రి వేళలో జాతీయ రహదారి కూడలి దాటి నకిరేకల్ పట్టణానికి రావాలంటే భయాందోళనకు గురవుతున్నారు.

అండర్‌పాస్ నిర్మాణమే పరిష్కారం

హైదారబాద్–విజయవాడ రహదారి విస్తరణ సమయంలో నకిరేకల్ ప్రధాన జంక్షన్ వద్ద అండర్‌పాస్ వంతెనలు నిర్మించలేదు. ఈ రోడ్డు గుండా రోజూ 50 వేలకుపైనే వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. కానీ ప్రమాదాల నివారణ చర్యలు మాత్రం చేపట్టలేదు. ప్రధానంగా నకిరేకల్‌లోని పద్మానగర్ వద్ద అండర్‌పాస్ నిర్మించలేదు. చీమలగడ్డ ఫ్లై ఓవర్ అండర్ పాసింగ్ నుంచి ఇనుపాముల జంక్షన్ వరకు సర్వీస్ రోడ్లు పూర్తి కాలేవు. నకిరేకల్ పట్టణం నుంచి హైదరాబాద్, నల్లగొండ వైపునకు వెళ్లాలంటే పద్మానగర్ జంక్షన్ దాటి వెళ్లాలి. జంక్షన్ దాటే క్రమంలో హైవేపై వాహనాలు అతి వేగంగా వెళ్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అండర్ పాసింగ్ వంతెన నిర్మాణంతో సమస్యకు చెక్ పడనుంది.



చీమలగడ్డ – ఇనుపాముల వరకు పూర్తి కాని సర్వీస్ రోడ్డు

అండర్‌పాస్ నిర్మాణానికి కృషి చేస్తా



నకిరేకల్‌లోని పద్మానగర్ జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు అండర్‌పాస్ నిర్మించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లా. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సహకారంతో నేషనల్ హైవే అధికారులకు ఈ విషయాన్ని నివేదించాం. కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే అండర్ పాస్ నిర్మాణం చేపడతాం.

– వేముల వీరేశం, ఎమ్మెల్యే, నకిరేకల్

ప్రమాదాలు జరగకుండా చూస్తాం



నకిరేకల్‌లోని పద్మానగర్ జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతాం. హైవేపై వాహనాల వేగాన్ని నియంత్రించేలా చూస్తాం. ఇక్కడ అండర్‌పాస్ నిర్మించాల్సిన అవసరం ఉందని హైవే అదికారులకు ప్రతిపాదనలు పంపాం. ప్రజలకు కూడా ఈ జంక్షన్ వద్ద జాగ్రత్తలు పాటించాలి.

– రాజశేఖర్, సీఐ, నకిరేకల్



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు



నృసింహుడి దర్శనం కోసం క్యూలైన్లలో బారులుదీరిన భక్తులు

యాదగిరి క్షేత్రంలో కోలాహలం

యాదగిరిగుట్ట: ఓ వైపు నిత్య పూజా కార్యక్రమాలు, మరోవైపు భారీగా తరలివచ్చిన భక్తుజనులతో యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో కోలాహలం నెలకొంది. ఆదివారం వేకువజామును ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూలు, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. ఆ తరువాత ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆయా వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రికి శ్రీస్వామి, అమ్మవార్లకు శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం చేశారు.

క్లుప్తంగా

పెద్దదేవులపల్లి వాసికి డాక్టరేట్


పీహెచ్‌డీ పట్టాతో మధుబాబు

త్రిపురారం: త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి గ్రామానికి చెందిన పసుల సైదులు, రాములమ్మ దంపతుల కుమారుడు మధుబాబు అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ లూసియానాలో పీహెచ్‌డీ పూర్తిచేసి డాక్టరేట్ అందుకున్నాడు. న్యూరో సైన్స్ విభాగంలో చేసిన మధుబాబు చేసిన పరిశోధనకు గాను శనివారం రాత్రి యూనివర్సిటీలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ వేడుకల్లో డాక్టరేట్ ప్రదానం చేశారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన మధుబాబు చిన్నప్పటి చదువులో చురుగ్గా ఉండేవాడని, అతడికి డాక్టరేట్ రావడం పట్ల తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

గంజాయి తాగుతూ పట్టుబడ్డ యువకులు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలం మహబూబ్‌పేట గ్రామంలో ఆదివారం గంజాయి తాగుతూ ముగ్గురు యువకులు పోలీసులకు పట్టుబడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌పేట గ్రామ శివారులో ఆదివారం కొంతమంది యువకులు గంజాయి తాగుతున్నారని పక్కా సమాచారం రావడంతో ఎస్‌ఐ అనిల్‌కుమార్ తన బృందంతో కలిసి దాడులు జరిపారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన ముగ్గురు గాజుల బాలకృష్ణ, గాజుల ప్రవీణ్, గాజుల సాయి గంజాయి సేవిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి 150 గ్రాముల గంజాయి, రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో గోల్డ్ వర్క్‌షాప్ దగ్ధం

మిర్యాలగూడ అర్బన్: షార్ట్ సర్క్యూట్‌తో గోల్డ్ వర్క్‌షాప్ దగ్ధమైంది. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి మిర్యాలగూడ పట్టణలో చోటు చేసుకుంది. మిర్యాలగూడ పట్టణంలోని పెద్ద బజారులో మారోజు కిరణ్‌కుమార్, మునగాల శ్రీనివాస్ బంగారం వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. రోజుమాదిరిగా శనివారం రాత్రి షాప్ మూసివేసి ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి ఒకటిన్నర ప్రాంతంలో షాప్ నుంచి మంటలు వస్తుండటంతో స్థానికులు గమనించి ఫైర్ సిబ్బందికి, షాప్ యజమానులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రూ.5లక్షలతో పాటు ఐదు తులాల బంగారం దగ్ధమైనట్లు బాధితులు తెలిపారు.

కార్లు ఢీకొని చుక్కల దుప్పి మృతి


మృతిచెందిన చుక్కల దుప్పి

మిర్యాలగూడ: రోడ్డు దాటుతున్న చుక్కల దుప్పిని రెండు కార్లు ఢీకొట్టడంతో మృతిచెందింది. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి దామరచర్ల మండలం బొత్తలపాలెం గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ముఖేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బొత్తలపాలెం గ్రామ శివారులో చుక్కల దుప్పి రోడ్డు దాటుతుండగా.. కల్లేపల్లి వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. అదే సమయంలో కల్లేపల్లి నుంచి మిర్యాలగూడకు వస్తున్న మరో కారు కూడా దుప్పిని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని దుప్పి కళేబరాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొండ్రపోల్ పీహెచ్‌సీలో దుప్పి కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేసినట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు.

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య

- కార్పొరేట్ విద్యా పథకంతో ఉజ్వల భవిష్యత్‌కు ప్రభుత్వ సహకారం
- 31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం



రామన్నపేట: విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ విద్య చాలా కీలకమైనది. చాలామందికి ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ విద్యనభ్యసించాలనే కోరిక ఉంటుంది. కానీ కార్పొరేట్ విద్య పేదలకు అందని ద్రాక్షగా మారింది. ప్రతిభ గల పేద విద్యార్థుల కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కార్పొరేట్ విద్యా పథకాన్ని తీసుకొచ్చింది. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు ఈ పథకం ద్వారా తమ ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకునేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఈ పథకానికి సంబంధించి 2025–26 విద్యా సంవత్సరానికి గాను దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 4వేల మంది విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకం అందించనుంది. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో నాలుగు వందలకు పైగా మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు చెందిన విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తుంది. విద్యార్థులు జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత, ఏయిడెడ్, కస్తూర్బా, నవోదయ, గురుకుల, ఆదర్శ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఈ పథకానికి అర్హులు. మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుంది. ఎంపికైన విద్యార్థులకు కళాశాలతో కూడిన సమాచారం అందిస్తారు.

దరఖాస్తు చేసుకునే విధానం

మీసేవా కేంద్రాల ద్వారా టీఎస్ ఈపాస్ పోర్టల్‌లో telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. విద్యార్థి తమ పూర్తి వివరాలు, పదో తరగతి మార్కుల ధ్రువపత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివిన స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, ఆదాయ, కుల ధ్రువపత్రాలను సమర్పించాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షలకు మించరాదు. ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం రూ.36వేలు ప్రోత్సాహకం అందించనుంది.

గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి


వసంతకుమారి

కార్పొరేట్ విద్యా పథకం ప్రతిభ గల పేద విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. ఎంపికైన విద్యార్థులకు రెండేళ్లపాటు కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత విద్య, వసతి కల్పించబడతాయి.

– వసంతకుమారి, యాదాద్రి భువనగిరి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ అధికారి

• రహదారికి పూల తోరణం



పోచంపల్లి మున్సిపాలిటీ పరిధితో పాటు మండలంలో చాలా గ్రామాల్లో ఎక్కడ చూసినా రోడ్డు వెంట విరబూసిన గుల్‌మోహర్ చెట్లు బాటసారులను కనువిందు చేస్తున్నాయి. గతంలో రోడ్డు వెంట నాటిన గుల్‌మోహర్ చెట్లు వేసవిలో ఎర్రటిరంగు పూలతో విరబూసి పల్లెలకు కొత్త అందాలను తెచ్చాయి.

– భూదాన్‌పోచంపల్లి

వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

- వడ్డెర మేలుకొలుపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలకుంట్ల బాలకృష్ణ


మాట్లాడుతున్న ఆలకుంట్ల బాలకృష్ణ

తాళ్లగడ్డ (సూర్యాపేట): వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చడంతో పాటు వడ్డెరులకు రాయి, మట్టిపై ప్రభుత్వం తగిన హక్కులు కల్పించాలని వడ్డెర మేలుకొలుపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలకుంట్ల బాలకృష్ణ అన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన 'హలో వడ్డెర–ఛలో సూర్యాపేట' సభకు ఆయన హాజరై మాట్లాడారు. నిత్యం క్వారీల్లో, మట్టి పనిచేసే వడ్డెర కులస్తులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. గుట్టలపై క్రషర్ మిల్లులను వడ్డెరులకు కేటాయించాలని కోరారు. వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. వయసు పైబడిన వడ్డెర వృత్తిదారులకు పెన్షన్ ఇవ్వాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వడ్డెర కులస్తులకు అధిక సీట్లు కేటాయించాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించని ప్రభుత్వాలను గద్దె దింపుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓర్సు రాజు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఓర్సు అంజయ్య, కార్యదర్శి రూపని రాజు, పసుల సోమయ్య, కోశాధికారి గోగుల మహేష్, యూత్ అధ్యక్షుడు వరికుప్పల నవీన్, సోషల్ మీడియా ఇన్‌చార్జి శివరాత్రి గోపి, రాష్ట్ర కమిటీ సభ్యుడు పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన లారీ.. ఒకరికి గాయాలు

ఆలేరు: కారును లారీ ఢీకొట్టడంతో ఒకరికి గాయాలయ్యాయి. ఆలేరు ఎస్‌ఐ రజినీకర్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మండలం కమటంగూడేనికి చెందిన కందుకూరి స్వాతిక్(18) ఆదివారం డ్రైవర్‌తో కలిసి కారులో ఆలేరుకు వస్తున్నాడు. మార్గమధ్యలో ఆలేరు బైపాస్‌లోని సాయిబాబా దేవాలయం సమీపంలోని యూటర్న్ వద్దకు రాగానే కారును వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్వాతిక్‌కు గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం అతడిని ఆస్పత్రి తరలించారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు..

చౌటుప్పల్ రూరల్: రోడ్డు దాటుతున్న లారీ డ్రైవర్‌ను కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండలం తుప్రాన్‌పేట గ్రామ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చౌడంపల్లి గ్రామానికి చెందిన బొప్పని సైదులు(28) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం హైదరాబాద్ నుంచి విజయవాడకు లారీ లోడ్ చేసుకుని బయల్దేరాడు. మార్గమధ్యలో తుప్రాన్‌పేట గ్రామ పరిధిలోని ఓ హోటల్‌లో టీ తాగేందుకు లారీ ఆపాడు. విజయవాడ–హైదరాబాద్ హైవే దాటి హోటల్‌కు వెళ్తుండగా విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు సైదులును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సైదులు తలకు తీవ్ర గాయమైంది. కాలు రెండు చోట్ల విరిగింది. చికిత్స నిమిత్తం అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి. మన్మథకుమార్ తెలిపారు.

నృసింహుడిని దర్శించుకున్న సమాచార కమిషనర్


శ్రీనివాస్‌రావుకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న డిప్యూటీ ఈఓ భాస్కర్‌శర్మ

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర సమాచార కమిషనర్ పీవీ శ్రీనివాస్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చనమూర్తులను దర్శించుకుని, అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. వారికి అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, డిప్యూటీ ఈఓ భాస్కర్‌శర్మ లడ్డూ ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అంతకుముందు అతిథి గృహం వద్ద కలెక్టర్ హనుమంతరావు, ఆర్డీఓ కృష్ణారెడ్డి వారికి స్వాగతం పలికారు.

అత్త, మామపై అలుడి దాడి

- అత్త మృతి
- మామకు తీవ్ర గాయాలు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న భువనగిరి డీసీపీ ఆకాంక్ష్ యాదవ్

గుండాల: మద్యం మత్తులో అత్త, మామపై అల్లుడు దాడి చేయడంతో అత్త మృతి చెందింది. మామకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గుండాల మండలం సుద్దాల గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా లింగాల ఘణపురం మండలం మాణిక్యపురం గ్రామానికి చెందిన గుగులోతు జున్నూబాయి(50), రాజయ్య దంపతుల కుమార్తె చుక్కవ్వను అదే గ్రామానికి చెందిన కాలియా బచ్చన్, లింగబాయి దంపతుల కుమారుడు కనకయ్యకు ఇచ్చి 16ఏళ్ల క్రితం వివాహం చేశారు. గుగులోతు జున్నూబాయి, రాజయ్య దంపతులు గుండాల మండలం సుద్దాల గ్రామానికి చెందిన గూడ పృథ్వీ మామిడి తోటను కౌలుకు తీసుకొని జీవనం సాగిస్తున్నారు. వ్యసనాలకు బానిసైన కనకయ్య ఇటీవల మరో మహిళ గౌరమ్మను పెళ్లి చేసుకొని గుండాల మండలం బూర్జుబావి గ్రామంలో ఇద్దరు భార్యలతో కలిసి మామిడి తోటను కౌలుకు తీసుకొని ఉంటున్నాడు. శనివారం రాత్రి మద్యం మత్తులో ఉన్న కనకయ్య సుద్దాల గ్రామంలో అత్తమామలు ఉంటున్న మామిడి తోట వద్దకు వచ్చి వారితో గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఇనుప వస్తువుతో అత్త, మామపై దాడి చేయడంతో జున్నూబాయి అక్కడికక్కడే మృతి చెందింది. రాజయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గుండాల గ్రామంలో మామిడి తోటను కౌలుకు తీసుకొని ఉంటున్న కాలె కృష్ణ ఆదివారం ఉదయం సుద్దాల గ్రామానికి వెళ్లి చూడగా రాజయ్య రక్తపు మడుగులో పడి ఉండటం చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మృతురాలి పెద్ద కుమార్తె కాలియా పెంటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని గాయాలపాలైన రాజయ్యను చికిత్స నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి, జున్నూబాయి మృతదేహాన్ని ఆలేరు ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు చెప్పారు. ఘటనా స్థలాన్ని భువనగిరి డీసీపీ ఆకాంక్ష్ యాదవ్, సీఐ శంకర్, ఎస్‌ఐ జి. సైదులు పరిశీలించారు.

మట్టి తరలిస్తున్న వాహనాలపై కేసు నమోదు

మునుగోడు: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా చెరువులోని మట్టిని తరలిస్తున్న తొమ్మిది వాహనాలను మునుగోడు పోలీసులు ఆదివారం స్టేషన్‌కు తరలించి వాటి యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు మండలం సోలిపురం గ్రామంలోని గాంధీసాగర్ చెరువు నుంచి శనివారం రాత్రి 5 జేసీబీలు, 10 టిప్పర్లు, 30 ట్రాక్టర్లతో పెద్ద మొత్తంలో అక్రమంగా మట్టిని తరలిస్తుండగా గ్రామస్తులు అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే స్పందించినా అధికారులు ఆ వాహనాలను పట్టుకొని కేసు నమోదు చేయాలని పోలీసులకు సూచించగా.. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే లోపే పలువురు జేసీబీలు, ట్రాక్టర్లు, టిప్పర్లతో అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు వెళ్లే సమయానికి అక్కడ 2 జేసీబీలు, 6 టిప్పర్లు, ట్రాక్టర్ ఉండటంతో వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆ 9 వాహనాలతో పాటు వాటి ఓనర్లు, డ్రైవర్లపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గాంధీసాగర్ చెరువులో నుంచి వారం రోజులుగా అక్రమంగా మట్టి తరలిస్తున్నారని స్థానిక అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

వేధింపులు తాళలేక బావిలోకి దూకిన వివాహిత

- బావిలో నీటిని తొలగిస్తున్న ఫైర్ సిబ్బంది
- గాలింపు చర్యలు ముమ్మరం


సంధ్య

ఆత్మకూరు(ఎం): భర్త, అత్తమామల వేధింపులు తాళలేక వివాహిత వ్యవసాయ బావిలో దూకింది. ఈ ఘటన ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు(ఎం) మండలం మొరిపిరాల గ్రామానికి చెందిన కటికె రాములు, మారెమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. చిన్న కుమారుడు కటికె కృష్ణకు జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కంచనపల్లి గ్రామానికి చెందిన కేమెడీ బైరయ్య, జయలక్ష్మి దంపతుల రెండో కుమార్తె సంధ్యతో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. వివాహానికి ముందు కృష్ణ హైదరాబాద్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో పనిచేసేవాడు. వివాహం తర్వాత గ్రామంలోనే వ్యవసాయం చేసుకుంటూ ఉన్నాడు. ఆరు నెలల నుంచి భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆత్మకూరు(ఎం) పోలీస్ స్టేషన్‌లో సంధ్యపై కృష్ణ, జనగామ జిల్లా రఘునాథపల్లి పోలీస్ స్టేషన్‌లో కృష్ణపై సంధ్య పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో జీవతంపై విరక్తి చెందిన సంధ్య ఆదివారం సాయంత్రం ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో సిద్ధాపురం రోడ్డు పక్కన వ్యవసాయ బావిలో దూకింది. సమీపంలో మామిడి చెట్టుకు కాపలాగా ఉన్న కుర్రాడు చూసి చుట్టుపక్కల వారికి సమామాచారం అందించాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ కృష్ణయ్య ఘటనా స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. బావి గట్టుపై ఆధార్‌కార్డు, చెప్పుల జత, సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఫైరింజన్ సహాయంతో వ్యవసాయ బావి నుంచి నీటిని తోడుతున్నారు. బావిలో నీరు చాలా ఉండటంతో రాత్రి 11.30గంటల వరకు కూడా సంధ్య ఆచూకీ లభించలేదు. తనను భర్త కృష్ణతో పాటు అత్త, మామ, బావ, తోటికోడలు వేధిస్తున్నారని, పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యకు పరిష్కారం దొరక్కపోవడంతో తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సంధ్య సూసైడ్ నోట్‌లో రాసినట్లు తెలిసింది.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తిప్పర్తి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. తిప్పర్తి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలం సర్వారం గ్రామానికి చెందిన రాచమల్ల మల్లమ్మ(60) ఈ నెల 14న తన కుమారుడు రాచమల్ల కోటిలింగంతో కలిసి సర్వారం నుంచి మామిడాల గ్రామానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా.. రోడ్డుపై గుంతలు ఉండటంతో మల్లమ్మ కిందపడిపోయింది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆమెను నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. మృతురాలి కుమారుడు రాచమల్ల నాగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమొదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

కారు ఢీకొని..


అర్జున్ (ఫైల్)

నకిరేకల్: నకిరేకల్ మండలం చందపట్ల గ్రామానికి చెందిన గాదె అర్జున్(26) బైక్‌పై ఈ నెల 3న నకిరేకల్‌కు వస్తుండగా.. పట్టణ శివారులోని ఎస్ఎఫ్ గార్డెన్ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అర్జున్‌ను స్థానికులు నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కుటుంబ సభ్యులు నల్లగొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఈ నెల 14న హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. మృతుడు అవివాహితుడు. ఆదివారం మృతుడి సోదరుడు ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

మీసేవ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారిగా శ్రీకాంత్


గొట్టిపర్తి శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న మీసేవ ఆపరేటర్స్ అసోసియేషన్ సభ్యులు

సూర్యాపేట అర్బన్ : తెలంగాణ మీసేవ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారిగా సూర్యాపేట పట్టణానికి చెందిన గొట్టిపర్తి శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని బృందావన్ ఇన్‌లో అన్ని జిల్లాల అసోసియేషన్ల అధ్యక్ష, కార్యదర్శుల సమక్షంలో రాష్ట్ర కోశాధికారిగా ఎన్నికైన శ్రీకాంత్‌తో ప్రమాణస్వీకారం చేయించి సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గంలో స్థానం కల్పించినందుకు అధ్యక్ష, కార్యదర్శులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీకాంత్ ఎన్నిక పట్ల సూర్యాపేట జిల్లా మీసేవ ఆపరేటర్స్ అభినందనలు తెలిపారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

కోదాడరూరల్: ఆర్థిక పరిస్థితులు బాగోలేక మానసికంగా కృంగిపోయిన మహిళ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన కోదాడ మండలం కూచిపూడి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. కోదాడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణానికి చెందిన నవ్య(22)కు కోదాడ మండలం కూచిపూడికి చెందిన సాయిబాబాతో నాలుగేళ్ల కిందట వివాహం జరిగింది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు, మానసికంగా కూడా బాగోలేకపోవడంతో ఆదివారం భర్త బయటకు వెళ్లిన తర్వాత నవ్య ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు చేసుకుంది. నవ్య కుమార్తె గేటు వద్ద ఏడుస్తూ కనిపించడంతో పక్కింటివాళ్లు వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా నవ్య విగత జీవిగా కనిపించింది. మృతురాలి తల్లి వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వడదెబ్బతో దివ్యాంగుడు మృతి


షేక్ ముజీబ్ (ఫైల్)

పెన్‌పహాడ్: వడదెబ్బకు గురై దివ్యాంగుడు మృతి చెందాడు. ఈ ఘటన పెన్‌పహాడ్ మండలం అనంతారం గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతారం గ్రామానికి చెందిన షేక్ లతీఫ్‌సాబ్ కుమారుడు ముజీబ్ (30) శుక్రవారం సూర్యాపేటలో నిర్వహించిన దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి ఎండలో వెళ్లి వచ్చి వడదెబ్బకు గురయ్యాడు. అతడిని కుటుంబ సభ్యులు సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు.

ఏఐవైఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా వెంకటేశ్వర్లు


వెంకటేశ్వర్లు

నల్లగొండ టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలో ఈ నెల 15 నుంచి 18 వరకు జరిగిన ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సంఘం నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లును ఏఐవైఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నిడమనూరు పీహెచ్‌సీలో అగ్నిప్రమాదం

- కాలిబూడిదైన రూ.5లక్షలకు పైగా విలువైన మందులు, సామగ్రి


ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని స్టోర్ రూంలో ఎగిసిపడుతున్న మంటలు

నిడమనూరు: నిడమనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా స్టోర్ రూంలో మంటలు చెలరేగడంతో ఆస్పత్రి కాపలాదారుడు ఉదయ్‌రాజ్ ఊపిరాడక నిద్రలేచి ఆస్పత్రి బయటకు పరిగెత్తాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏఎస్‌ఐ జోజి వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సబ్ స్టేషన్ సిబ్బందికి చెప్పి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. హాలియా నుంచి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. స్టోర్ రూంలో కొన్ని మందులు మండే స్వభావం కల్గి ఉండటంతో ఆస్పత్రిలోని అన్ని గదులకు పొగ వ్యాపించింది. ఫ్రిజ్‌లు, ఆపరేషన్ థియేటర్‌లోని పరికరాలు, ఫర్నీచర్, ఆస్పత్రి బెడ్స్, ల్యాబ్ పరికరాలు, రిజిస్టర్లు, డాక్యుమెంట్లు, దగ్ధమయ్యాయి. రూ.5లక్షలకు పైగా నష్టం జరిగినట్లు పోలీసులు, ఆస్పత్రి వర్గాలు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. ఆస్పత్రి సీహెచ్‌ఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ జోజి తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కేస రవి ఆదివారం తెల్లవారుజామున పీహెచ్‌సీని పరిశీలించారు.

నిర్వహణ సరిగ్గా లేక..

నిడమనూరు పీహెచ్‌సీ భవనం 2001లో నిర్మించారు. నీటి లీకేజీతో భవనం స్లాబ్ ధ్వంసమైంది. భవన నిర్వహణ సరిగ్గా లేకనే షార్ట్ సర్క్యూట్ జరగడానికి కారణమని తెలుస్తోంది. నీటి లీకేజీలతో ఎర్త్ వచ్చేదని, కనీస జాగ్రత్తలు పాటిస్తే షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగే ఉండేది కాదని పలువురు అంటున్నారు.

వైద్యం వికటించి మహిళ మృతి

సూర్యాపేటటౌన్: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మహిళకు గర్భసంచి ఆపరేషన్ చేస్తుండగా వైద్యం వికటించి అపస్మారకస్థితిలోకి వెళ్లింది. హుటాహుటిన హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె ఆదివారం మృతి చెందింది. వివరాలు.. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన మహిళకు గర్భసంచి సమస్య ఉండటంతో పది రోజుల క్రితం కుటుంబ సభ్యులు స్థానికంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు పరీక్షించి ఆపరేషన్ చేయాలని చెప్పారు. ఆపరేషన్ చేస్తుండగా ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వెంటనే ఆస్పత్రి యాజమాన్యం హైదరాబాద్‌లోని ఓ పెద్దాస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది.

'గోపా' బలోపేతానికి కృషిచేయాలి


సభ్యత్వం అందజేస్తున్న గోపా జిల్లా కార్యవర్గ సభ్యులు

తాళ్లగడ్డ (సూర్యాపేట): గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) బలోపేతానికి కృషిచేయాలని ఆ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీకూరు సత్యం గౌడ్ అన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని సాయి గౌతమి జూనియర్ కళాశాలలో గోపా జిల్లా అధ్యక్షుడు బూర రాములు గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశాని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విస్తృత స్థాయిలో గోప సభ్యత్వాలు చేయించాలని, భవిష్యత్ కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా పలువురికి సభ్యత్వాలు అందజేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాతి సవీందర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరగాని లక్ష్మయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు నామాల గురుమూర్తి గౌడ్, కోశాధికారి అయితబోయిన రాంబాబు గౌడ్, జాయింట్ సెక్రటరీలు రాపర్తి మహేష్ గౌడ్, భూపతి నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.